క్లుప్తంగా

ఆడారికి మద్దతుగా ప్రచారం



గొల్లకంచరపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పల్లా ఎర్నికుమార్ యాదవ్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి తోటవీధి, దుర్గానగర్, గొల్ల కంచరపాలెం ప్రాంతాల్లో గురువారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 52,56,57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జ్ పల్లా ఎర్నికుమార్ యాదవ్ నేతృత్వంలో మహిళలు ఇంటింటికీ వెళ్లి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు సర్వసిద్ధి సాయిలత, ఎం.రాజ్యం, సమ్మి దుర్గా, బి.నీలవేణి, పోతిరెడ్డి శ్రావణి పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకూ పథకాలు అందించిన ఘనత మాదే



వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తున్న రమాకుమారి

సింధియా : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేసిన జగనన్నకు అన్నీ పార్టీల్లో ఫ్యాన్స్ ఉన్నారన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత దేశ చరిత్రలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో సోదరుడు ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

62వ వార్డులో ..

వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 62వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు ఓటర్లను అభ్యర్థించారు. అల్లూరిసీతారామరాజుకాలనీలోని పోలింగ్‌బూత్ నంబర్ 145 పరిధిలో గడప గడపకు వెళ్లి ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశాఖ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ చింతా ప్రభాకర్, సచివాలయ కన్వీనర్ బాబూరావు, రఘు, జీవన్, లక్ష్మీ, ఫణికుమార్, పరశురామ్, రవి, గృహసారథులు, పాల్గొన్నారు.

92వార్డులో జైభారత్ పార్టీ అభ్యర్థి ప్రచారం



శ్రీరామ్‌నగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న జైభారత్ పార్టీ అభ్యర్థి వెంకట గణేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో జైభారత్‌పార్టీ అభ్యర్థి జె.వెంకట గణేష్ ప్రచారం చేశారు. ద్విచక్రవాహనాలపై తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీరామ్‌నగర్‌లో లస్సీ దుకాణం వద్ద మహిళకు కరపత్రాలు అందించారు. తాను చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

గణబాబూ.. కక్కుర్తి



జీవీఎంసీ టిప్పర్‌లో లోడింగ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)



ఎమ్మెల్యే గణబాబు ఇంటి ముందు మట్టిని పోగుచేస్తున్న దృశ్యం (ఫైల్)

- అధికార దుర్వినియోగం... బెదిరింపులు ఆయన రాజకీయం
- అధికారులను, సిబ్బందిని బెదిరించి పబ్బం గడుపుకోవడం అలవాటు
- జీవీఎంసీ వాహనాలను సొంతానికి వాడుకున్న వైనం
- వైఎస్సార్‌సీపీకి సహకరిస్తే ఊరుకునేదిలేదంటూ వ్యాపారులకు బెదిరింపులు
- తాయిలాలకు లొంగని ఆర్పీలకూ తప్పని హెచ్చరికలు

గోపాలపట్నం: గణ..ఆపేరు చెబితేనే పశ్చిమ నియోజకవర్గంలో అధికారులు, ఆర్పీలు, వ్యాపారులు గజగజలాడిపోతున్నారు. టీడీపీ ఎమ్మెల్యేగా ఉంటూ తన మాట వినని వారిని బెదిరిస్తూ ప్రత్యేక పాలన సాగిస్తున్నారు. గెలిపించిన ప్రజలను పట్టించుకోకుండా..అభివృద్ధి చేయాలన్న ఆలోచనే లేకుండా పదేళ్లుగా నియోజకవర్గంలో గణబాబు చక్రం తిప్పుతున్నాడు. అడ్డొచ్చిన వారిని తన దారికి తెచ్చుకోగల సమర్థుడు. గణబాబు అనుచరగణం కూడా అడ్డూ అదుపులేకుండా రెచ్చిపోతుంటారు. ఎన్నికల సమయంలో వీరి హంగామా ఇంతాఅంతాకాదు. ప్రజల మనసులు గెలవలేని గణబాబు..అడ్డదారుల్లో గద్దెనెక్కడం కోసం ఎంతవరకైనా వెళతాడని పేరుంది. నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన ఎమ్మెల్యే తన ఇళ్ల నిర్మాణాల కోసం అడ్డదారుల్లో తొక్కడం ప్రజలను సైతం ఆశ్చర్యపరిచింది. ఈ కక్కుర్తి పనులేంటి గణబాబూ అంటూ నియోజకవర్గం ప్రశ్నిస్తోంది.

జీవీఎంసీనీ వదల్లేదు

గోపాలపట్నం తన ఇళ్ల నిర్మాణం సమయంలో జీవీఎంసీ టిప్పర్లను యథేచ్ఛగా గణబాబు వాడుకున్నారు.అంతే కాకుండా ప్రొక్‌లెన్యర్లను సైతం మట్టి తవ్వకాలకు, మట్టిని తరలించేందుకు టిప్పర్లను తన సొంత వాహనాలుగా వాడుకున్నారు. ఇది చూసిన వారు సైతం ఇదేమి కక్కుర్తి అంటూ ఛీదరించుకున్నారు. ఇంత పెద్ద భవనం కట్టుకునే వారు మట్టి తరలించేందుకు ప్రయివేటు వాహనాలను సమకూర్చుకోలేరా? జీవీఎంసీ వాహనాలా కావాలా? ఎంత ఎమ్మెల్యే అయితే మాత్రం జీవీఎంసీని అంతలా వాడేసుకోవాలా అంటూ ప్రజలు అసహ్యించుకున్నారు.

ఎవరైనా ప్రశ్నిస్తే..

టీడీపీ ఎమ్మెల్యే గణబాబు ముందు మాట్లాడే అవకాశం ఉండదు. ఏ సాయం కోసమైనా ప్రజలు ఆయన వద్దకు వస్తే గేటు కూడా తీయడు. గత నారావారి పాలనలో గణబాబుకు ఎదురులేకుండా పోయింది. గణబాబును ఎవరైనా ప్రశ్నిస్తే ఇంకేమైనా ఉందా? ప్రశ్నించిన వారికి ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందేవికావు. అందుకే ఆయన పేరు చెబితే పశ్చిమ నియోజకవర్గం వణికిపోతోంది.

ఆర్పీలు, వ్యాపారులకు బెదిరింపులు

తెలుగుదేశం పార్టీ బెదిరింపు రాజకీయలకు తెగపడుతోంది. టీడీపీ ఎమ్మెల్యే గణబాబు అండ్ గ్యాంగ్‌కు తనకు అనుకూలంగా లేకపోతే వారిపై జులుం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తున్నామని, టీడీపీకి అనుకూలంగా పనిచేయకపోతే అప్పుడు మీ సంగతి తేలుస్తామని ఆర్పీలను బెదిరిస్తున్నారు. అంతేకాకుండా వివిధ సందర్భాలలో ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్పీల పాత ఫొటోలు చూపిస్తూ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేస్తున్నట్టు తమ అనుకూల పత్రికల్లో వార్తలు రాయించి మీ ఉద్యోగులు తీయించివేస్తామని బెదిరిస్తున్నట్టు ఆర్పీలు వాపోతున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగక పోవడం వారి దృష్టిలో నేరంగా భావించి కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష



ఓటు అభ్యర్థిస్తున్న ఆనంద్‌కుమార్

- ఆదరించండి...అభివృద్ధి చేసి చూపిస్తా
- ఓటమి భయంతోనే టీడీపీ నాయకుల ప్రలోభాలు
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్



నియోజకవర్గ పరిస్థితులను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, అల్లా కృష్ణ

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలే శ్రీరామ రక్షగా తన గెలుపునకు దోహదపడతాయని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 52వ వార్డు కరాస రామాలయం వీధి, ప్రియాకం కాలనీ ఏరియాల్లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లా కృష్ణతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆనంద్ కుమార్ తమ కాలనీకు వచ్చారని తెలుసుకున్న ప్రజానీకం స్వచ్ఛందంగా తరలివచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లిన ఆనంద్ కుమార్‌కు మహిళలు హారతులు ఇచ్చి గెలుపు మీదేనని ఆశీర్వదించారు. తనను గెలిపిస్తే, నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమన్నారు. తనను గెలిపిస్తే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. తనపై నమ్మకంతో సమన్వయకర్తగా నియమించిన నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ, తోచిన రీతిలో సేవా కార్యక్రమాలను సైతం నిర్వహించానని గుర్తు చేశారు. తనతో పాటు, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీను కూడా గెలిపించేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో ఈసారి వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజాశీర్వాదం ఎంతో ఘనంగా లభిస్తోందన్నారు. దీన్ని చూసిన టీడీపీ నాయకులకు అప్పుడే ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకనే కొన్ని వర్గాలను ప్రలోభాలకు గురిచేస్తూ, అడ్డదారుల్లో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు ఎంతో విజ్ఞులను, సంక్షేమానికి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందన్నారు. ఆనంద్‌కుమార్ గెలిస్తే, నియోజకవర్గం రూపురేఖలు మారేలా అభివృద్ధి పనులు చేస్తారని, వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థులకు ఓటు వేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, విశాఖమార్కెట్ కమిటీ చైర్మన్ అల్లాకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జియ్యాని విజయ్ కుమార్, రామకృష్ణ, శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

యల్లపువానిపాలెంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం



మాట్లాడుతున్న అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, గేదెల మురళీకృష్ణ, మోహన్‌రావు

గోపాలపట్నం: యల్లపువానిపాలెం టీడీపీ మాజీ అధ్యక్షుడు పొలమరశెట్టి మోహనరావు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం రాత్రి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఆయన చేరారు. గురువారం 89వ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ గురువారం విలేకర్ల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రామంలో మంచి పేరు ఉన్న నాయకుడు మోహన్‌రావు అని, ఆయన చేరికతో మరింత బలం చేకూరినట్టయిందన్నారు. జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్ గేదెల మురళీకృష్ణ మాట్లాడుతూ యల్లపువానిపాలెంలో చాలా ఏళ్లుగా టీడీపీలో ఉన్న నాయకుడు వైఎస్సార్‌సీపీ విధానాలకు ఆకర్షితుడై రావడం సంతోషకరంగా ఉందన్నారు. మీడియా సమావేశంలో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో శిక్షణ ప్రారంభం



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న మీనాక్షి

కంచరపాలెం: గొల్ల కంచరపాలెం సీతారామ మందిర ప్రాంగణంలో మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కూచిపూడి నృత్య శిక్షణ కార్యక్రమాన్ని శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నెల రోజుల పాటు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకురాలు డి.మీనాక్షి తెలిపారు. కూచిపూడి బేసిక్స్, ఐటెమ్స్, థీమ్స్, ఫ్లోక్ డ్యాన్స్, సినీ క్లాసికల్ అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జూన్ 2న జరిగే ముగింపు కార్యక్రమంలో కళాకారులకు సర్టిఫికెట్లు, మెడల్లు అందిస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కొయ్య ఉమ జగదీష్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రమజీవులకు ఆహారం పంపిణీ

సింధియా : బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పే బ్యాక్ సొసైటీ పిలుపు మేరకు సింధియా నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు రహదారి పొడువునా ఉన్న శ్రమజీవులకు సొసైటీ వ్యవస్థాపకుడు యు.వీ.రావు కుమార్తె చేతులమీదుగా బిర్యానీ, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉన్నంతలో తోటి వారికి సాయం చేయాలని పిల్లలకు తెలిసేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని యువీ రావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



పార్టీలో చేరిన టీడీపీ నాయకులతో ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కొరుబిల్లి విష్ణు, కరతాల తులసీ వారి అనుచరులు సుమారు 100 మంది వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి ఎల్లపుడూ గుర్తింపు ఉంటుందని, కొత్తగా చేరిన వారు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి అత్యధిక మెజార్టీ లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. 63వ వార్డులో ఉన్నటువంటి ప్రజాసమస్యలను తాను అధికారంలోకి వచ్చిన వెంటనే చక్కదిద్దుతానని హామీ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ గడిచిన 18 నెలల్లో ఎటువంటి అధికారం లేకపోయిన తన సొంత నిధులతో చేసినటువంటి సేవా కార్యక్రమాలు నచ్చి ఆడారి ఆనంద్ కుమార్‌కు మద్దతు ఇస్తున్నామని, అందుకే పార్టీలో చేరామని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు.

అబద్ధాల చంద్రబాబును శ్రీలంక పంపుదాం



సమావేశంలో పాల్గొన్న 40వ వార్డు పార్టీ క్యాడర్



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

- మోసం చేసే కూటమికి బుద్ధి చెబుదాం
- మంచి చేసే సీఎం జగన్‌ను, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌ను గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో రమాకుమారి

మల్కాపురం: నవరత్నాల పేరుతో పలు పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి పేదల బతుకులను తీర్చిదిద్దారని వైఎస్సార్‌సీపీ నేత, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి పేర్కొన్నారు. ఈ పథకాలతో రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నాడని విమర్శలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పుడు అవే పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టోలో చేర్చడం చూస్తుంటే జగనన్న నవరత్నాలు అద్భుతం అని ఒప్పుకున్నట్టే కదా అని ప్రశ్నించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వార్డు నక్కవానిపాలెం పార్టీ క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని గతం ప్రభుత్వ పాలనలో మహిళలకు చంద్రబాబు హామీ ఇచ్చారని, అలాగే నిరుద్యోగ భృతి, రైతులకు రుణాల మాఫీ ఇలా అనేక హామీలను ఇచ్చి, గెలిచిన తరువాత వాటిని పక్కన పెట్టిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. సూపర్ సిక్స్ పేరిట మరోసారి మాయ చేసేందుకు కూటమితో బయలుదేరాడని, చంద్రబాబు అండ్ కో నేతలను నమ్మవద్దని సూచించారు. చంద్రబాబును బీజేపీకి కూడా నమ్మడం లేదన్నారు. ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ ఇదే ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ ఎన్నికల పరిశీలికులు పీలా ఉమారాణి, మండల క్లస్టర్ అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి



కళింగ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, నూతన సంస్కరణలు–పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించిన తీరు దేశానికే ఆదర్శమని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డులో కళింగ సంక్షేమ సంఘాల సభ్యులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కళింగ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్ అత్యున్నత గుర్తింపునిచ్చారన్నారు. జగనన్నకు రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, దీనిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి వచ్చేలా గట్టి గుణపాఠం నేర్పుతారన్నారు. నవరత్నాలు ద్వారా రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరిగిందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే వైఎస్సార్‌సీపీకి మరోసారి ఘన విజయాన్ని కట్టబెడతాయని అన్నారు. రాష్ట్రానికి జగన్ లాంటి ముఖ్యమంత్రి అవసరమని ప్రజలు గుర్తించారని, అందుకే ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో తనకు అవకాశం కల్పించాలని, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పేడాడ రమణి కుమారి, మూల ధనుంజయరావు, సింగపురపు సత్యనారాయణ, మెట్ట చిన్నారావు, కళింగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట ఇస్తే నెరవేరుస్తాడంతే..

- ఆడారి ఆనంద్‌కుమార్ నాయకుడు కాదు సేవకుడు
- ఆయన సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- 60వ వార్డులో జోరుగా ప్రచారం
- ఆడారిని గెలిపించాలని అభ్యర్థన



ఓటర్లతో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

మల్కాపురం : సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 60వ వార్డు ఇందిరాకాలనీ–2 ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపు కోరుతూ యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి గురువారం డోర్ టూ డోర్ ప్రచారాన్ని నిర్వహించారు. 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి మరల సంక్షేమ పాలన కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మీరంతా ముఖ్యమంత్రిని చేయాలన్నారు. చంద్రబాబు మాదిరిగా మోసపూరిత హామీలు ఇవ్వడం జగన్‌మోహన్‌రెడ్డికి చేతకాదన్నారు. మాట ఇస్తే ఆ మాటకు కట్టుబడి ఉండే తత్వం జగన్‌ది అని వివరించారు. అదే ఆలోచనలతో మెలిగే వ్యక్తి మీ ఆనంద్‌కుమార్ అని, మీ ప్రాంతంలో పేదలకు సేవలందించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కుటుంబ సభ్యుడిగా సొంత నిధులతో 250 మందికి పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణాలకు సాయం, స్కిల్డ్ డెవలప్‌మెంట్ ద్వారా నిరుద్యోగులకు శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఓటు వేసే ముందు అందుబాటులో ఉండే ఆత్మీయుడు కావాలా? ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకుడు కావాలో ఆలోచించుకోవాలన్నారు. సమర్థుడైన ఆడారి ఆనంద్‌ను గెలిపించుకుంటే నియోజకవర్గ అభివృద్ధితోపాటు పేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు ఆడారి హరీష్, మండల క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడిళ్లలో చోరీ

నగదు, బంగారు ఆభరణాల అపహరణ

గోపాలపట్నం: తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేశారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత వరుసుగా నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో దొంగలు ప్రవేశించి నగదుల, బంగారు వస్తువులు దోచుకున్నారు. వివరాలు ఇలా.. బుచ్చిరాజుపాలెం గవర వీధి, గాంధీనగర్, పైడిమాంబా కాలనీలో చోరీలు జరిగాయి. గవర వీధి నుంచి గాంధీనగర్‌కు వెళ్లే తాటిపూడి పైప్‌లైన్‌లో రెండు ఇళ్లలో దొంగలు తాళాలు పగలగొట్టి బంగారం, నగదు దోచుకుపోయారు. గవరవీధిలో ఉంటున్న విజయభాస్కర్ రుషికొండ వద్ద ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి జయప్రకాష్‌నగర్‌లో అత్తవారి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యాడు.ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం..బీరువా తెరిచి ఉండడంతో పరిశీలించగా బంగారు చైన్, మూడు ఉంగరాలు, చెవిదుద్దులు కనిపించలేదు. అలాగే గాంధీనగర్‌లో ఉంటున్న కొయ్యాన సింహాచలం ఇంటికి తాళం వేసి బుధవారం రాత్రి తన చెల్లి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికొచ్చిచూసేసరికి తాళాలు విరగగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న జత బంగారు చెవి దుద్దులు, వెండిపట్టీలు, రూ.50వేలు చోరీకి గురైనట్టు. అలాగే పైడిమాంబా కాలనీలో నివాసముంటున్న ఏఆర్ కానిస్టేబుల్ రమణ ఇంట్లో కూడా చోరీ జరిగింది. ఇంటి తాళం వేసి ఉండడంతో దొంగలు లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న 2 గాజులు, ఒక జత చెవి దుద్దులు, పుస్తెలు తాడు, 4 ఉంగరాలు, కారు స్పేర్ తాళం చెవి, రూ.50వేలు దోచుకు పోయారు. బాధితులు ఫిర్యాదులు చేయడంతో క్రైమ్ డీసీపీ రత్నకుమారి, ఏసీపీ శ్యామలరావు, వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాల శ్రీనివాసరావు సంఘటనా స్థలాలకు వెళ్లి వివరాలు సేకరించారు. గవర వీధి రైల్వే ట్రాక్ మీదుగా నలుగురు వ్యక్తులు ఈ ప్రాంతాలకు వచ్చినట్టు సీసీ టీవీ ఫుటేజ్‌లో గుర్తించారు.

చంద్రబాబు నిర్వాకంతోనే పింఛన్‌దారుల కష్టాలు



మల్కాపురం ఎస్‌బీఐ వద్ద క్యూలో ఉన్న వృద్ధులు, వితంతువులు

మల్కాపురం : చంద్రబాబు పుణ్యమా అని పింఛనుదారులు అవస్థలు పడుతున్నారు. రెండు నెలల నుంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పెన్షన్ల కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వలంటరీ వ్యవస్థ ద్వార ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందేది. ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇస్తే వారు వైఎస్సార్‌సీపీకి ఓటు వెయ్యించేలా లబ్ధిదారులను ప్రభావితం చేస్తారని మూర్ఖంగా ఆలోచించిన చంద్రబాబు..నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వృద్ధులను ఇబ్బందులకు గురిచేశాడు. ప్రతి నెల సంతోషంగా ఇంటివద్దనే పింఛను అందుకునే వృద్ధులు, వితంతువులు ఇప్పుడు మండుటెండలో బ్యాంకులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా మంది ఆయా బ్యాంకుల వద్ద చంద్రబాబు చేసిన నిర్వాకంపై మండిపడ్డారు. గురువారం పెన్షన్ల కోసం బ్యాంకుల వద్ద బారులుదీరారు. గత నెల సచివాలయాల వద్ద, ఈ నెల బ్యాంకుల వద్ద ఫించన్‌ల కోసం వృద్ధులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీహరిపురం, మల్కాపురం ఎస్‌బీఐ వద్ద అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. జనం ఎక్కువగా రావడంతో బ్యాంకు సిబ్బంది ప్రత్యేకమైన కౌంటర్లు ఏర్పాటు చేసి సాధ్యమైనంత త్వరగా పెన్షన్లు అందజేశారు.